ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక


సంపుటి: 2 | సంచిక: 81 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 1 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## మోదీ 3.0 లో
# మన్ కీ బాత్
## తల్లిని గుర్తు చేసుకుని ప్రధాని ఎమోషనల్

న్యూఢిల్లీ, జూన్ 30 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 111వ ఎపిసోడ్‌లో పలు అంశాలపై మాట్లాడారు. అయితే చివరి 110 ఎపిసోడ్ ఫిబ్రవరిలో ప్రసారం కాగా.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గత కొన్ని నెలలుగా ఈ కార్యక్రమం నిలిచిపోయింది. తర్వాత ఇన్ని రోజులకు తాజాగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ..మిగతా 2లో

## జులై 1 నుంచి అమల్లోకి
# కొత్త నేర చట్టాలు




న్యూఢిల్లీ, జూన్ 30 (ప్రభాత ఉదయం): భారత్‌లో జులై 1 నుంచి కొత్త న్యాయ చట్టాలు అమల్లోకి రానున్నాయి. దాదాపు 150 ఏళ్ల పాటు అంటే.. బ్రిటీష్ కాలం నుంచి అమల్లో ఉన్న చట్టాలు మారనున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం రాబోతున్నాయి. అయితే ఓవైపు ఈ కొత్త చట్టాలపై నిరసనలు వస్తుండగా.. మరోవైపు వీటి అమలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మార్పుల వల్ల జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడల్ ద్వారా సమన్లు జారీ చేయడం, పెద్ద నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరి వీడియోగ్రఫీ వంటి రూల్స్ అమల్లోకి రానున్నాయి. భారతీయ న్యాయ సంహిత చట్టంలో రాజద్రోహం స్థానంలో.. దేశద్రోహం అనే కొత్త పదాన్ని చేర్చారు. రాజ్యాంగ ఆదర్శాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలను త్వరగా పరిష్కరించేందుకు ఈ మార్పులు దోహదపడతాయని కేంద్రం ప్రభుత్వ అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

### కొత్త చట్టాల ప్రత్యేకత

నిందితులను పోలీసు కస్టడీకి తీసుకునేందుకు ఉద్దేశించిన గడువును ఈ కొత్త చట్టాల్లో పెంచారు. ఎవరైన అరెస్టయితే 14 రోజుల్లోపు మాత్రమే కస్టడీ కోరే ఛాన్స్ ఉంటుంది. అయితే 60 రోజుల్లోపు దర్యాప్తును పూర్తి చేయాల్సిన కేసుల్లో దీన్ని 40 రోజులకు పొడిగించారు. అలాగే 90 రోజుల్లోపు దర్యాప్తు చేయాల్సిన కేసుల్లో 60 రోజుల వరకు పెంచారు. ఏడేళ్లకు పైగా శిక్ష పడే ఛాన్స్ ఉన్న నేరాల్లో దర్యాప్తు అధికారులు ..మిగతా 2లో

## ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్‌గా
# పాలమూరు ముద్దుబిడ్డ
### రేవంత్ రెడ్డి, పవన్ కళ్యాణ్ స్పెషల్ విషెస్




హైదరాబాద్, జూన్ 30 (ప్రభాత ఉదయం): భారత బ్యాంకింగ్ సెక్టార్‌లో దిగ్గజమైన.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కొత్త ఛైర్మన్‌గా తెలుగు వ్యక్తి.. అందులోనూ తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులు కాబోతున్నారు. ఈ మేరకు శ్రీనివాసులు శెట్టి పేరును ఎఫ్ఎస్ఐబీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా.. శ్రీనివాసులు శెట్టికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన శ్రీనివాసులు శెట్టి.. ప్రతిష్టాత్మకమైన ఎస్‌బీఐ ఛైర్మన్ పదవిని చేపడుతుండటం.. ఒక మహత్తర సందర్భం అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఈ మేరకు ఆదివారం రోజున సీఎంవో తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ పెట్టింది. భారత దేశపు అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుకు నూతన ఛైర్మన్‌గా నియమితులు కాబోతున్న చల్ల శ్రీనివాసులు శెట్టికి.. తెలంగాణ తరపున సీఎం రేవంత్ రెడ్డి అభినందలు తెలిపారు. ఈ కొత్త బాధ్యతల్లో మరెన్నో విజయాలు, ప్రశంసలు అందుకోవాలని రేవంత్ రెడ్డి ఆంక్షించారు. కేవలం తెలంగాణ ముఖ్యమంత్రే కాదు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా శ్రీనివాసులు శెట్టికి అభినందనలు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్స్టిట్యూషన్స్ బోర్డు సిఫార్సు చేయడం తెలుగువారందరికీ గర్వకారణం అని పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్ వేదికగా తెలిపారు. శ్రీనివాసులు నేతృత్వంలో ..మిగతా 2లో

# సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



హైదరాబాద్, జూన్ 30 (ప్రభాత ఉదయం): సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు ప్రతిష్టాత్మక 'ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ' అవార్డు వరించింది. సింగరేణి సంస్థను పర్యావరణహిత సంస్థగా మార్చడమే కాకుండా తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి కోల్‌బెల్ట్ ఏరియాలోని ఆరు జిల్లాల్లో 35 చిన్న అడవులను సృష్టించినందుకు గుర్తింపుగా గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫౌండేషన్- 2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీ బలరాంకు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ, ప్రైవేటు రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ సంస్థ ప్రతి ఏడాది ప్రోత్సాహక అవార్డులు అందజేస్తూ వస్తుంది. ఇందులో భాగంగా సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నత స్థాయిలో తీరిక లేకుండా ఉండి కూడా పర్యావరణ పరిరక్షణ కోసం వేలాది మొక్కలు నాటినందుకు గాను పురస్కారం ప్రదానం చేసింది.

# సీఎం రేవంత్ ఇంటికి కేంద్రమంత్రి



హైదరాబాద్, జూన్ 30 (ప్రభాత ఉదయం): ఆదివారం హైదరాబాద్ వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ తన నివాసానికి ఆహ్వానించారు. రేవంత్ పిలుపు మేరకు ఇంటికొచ్చిన కేంద్ర మంత్రికి సీఎం స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు సమాచారం.



## ఏడాదికి రెండు లక్షల
# ఉద్యోగాలు ఎక్కడ?
## మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 30 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ఆదివారం నాడు రాష్ట్ర శాసనసభ సమావేశాల ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలపై ఒత్తిడి తేవాలి. నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారి నిజమైన డిమాండ్ల కోసం గాంధీ ఆస్పత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను పార్టీ విద్యార్థి నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. నిరాహార దీక్ష చేస్తున్న నాయకుడి ఆరోగ్యం క్షీణించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాయక్‌ను ప్రత్యక్షంగా సందర్శించి నిరుద్యోగ యువత సమస్యలపై ఆయనతో చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా నిరుద్యోగుల పక్షాన బీఆర్ ఎస్ పోరాటం చేస్తుందన్నారు. వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న నాయక్‌కు నిరసనను విరమించాలని విజ్ఞప్తి చేస్తూ, నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు బీఆర్ఎస్ తరపున పోరాటానికి సంఘీభావం తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ..మిగతా 2లో

# విహారయాత్రలో విషాదం
## మహిళతో సహా నలుగురు పిల్లలు జలపాతంలో గల్లంతు..



లోనావాలా, జూన్ 30 (ప్రభాత ఉదయం): విహారయాత్ర విషాదయాత్రగా మిగిలింది. జలపాతం చూసేందుకు వెళ్లిన ఓ కుటుంబం అందులో గల్లంతైంది. మహారాష్ట్రలోని లోనావాలాలో ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం భుసీ డ్యామ్ బ్యాక్ వాటర్ సమీపంలోని జలపాతం వద్ద ఐదుగురు గల్లంతయ్యారు. వెంటనే పోలీసులు, స్థానికుల సహాయంతో సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. జలపాతం దిగువన ఉన్న నాచు బండరాళ్ల వల్ల జారిపడి, నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. 40 ఏళ్ల మహిళతో పాటు 13 ఏళ్ల బాలిక మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు, 6 ఏళ్ల ఇద్దరు బాలికలు, నాలుగేళ్ల బాలుడి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు అధికారులు చెప్పారు. సంఘటన స్థలం భుసీ డ్యామ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందని ఎస్పీ వెల్లడించారు.



# తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్
## కొత్త స్టేడియం నిర్మాణంకు త్వరలో ప్రభుత్వంతో చర్చలు

హైదరాబాద్, జూన్ 30 (ప్రభాత ఉదయం): తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్ రానుంది. కొత్త స్టేడియం నిర్మాణంకు త్వరలో ప్రభుత్వంతో చర్చలు జరుపనుంది. తొలి దశలో రెండు మూడు జిల్లా కేంద్రాల్లో స్టేడియాలు కట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్ నియామకంపై కసరత్తు చేస్తోంది ప్రభుత్వం. పెండింగ్ ఆడిట్లకు మోక్షం కలుగనుంది. బీసీసీఐ నుంచి నిధుల రాకకు లైన్‌క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ఈనెల 8 నుంచి డొమిస్టిక్ క్రికెట్ సీజన్ ప్రారంభం కానుంది. మహిళల లీగ్ క్రికెట్‌కు రూట్ మ్యాప్.. బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్ నియామకమయ్యారు. తెలంగాణ క్రికెటర్ల శ్రేయస్సు, ప్రగతిని దృష్టిలో పెట్టుకుని హెచ్‌సీఏ క్రికెట్ ..మిగతా 2లో


# జులై 1 నుంచి అమల్లోకి
# కొత్త నేర చట్టాలు

మొదటి పేజీ తరువాయి...

తప్పకుండా ఫోరెన్సిక్ నిపుణులతే ఆధారాలు సేకరించాల్సి ఉంటుంది. 3 నుంచి 7 ఏళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే %ఖీ×=% నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే 14 రోజుల్లోనే ఈ కేసును కొలిక్కి తేవాలి. అత్యాచారానికి గురైన బాధితుల వాంగ్మూలాన్ని సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు అధికారి నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆ బాధితురాలి వైద్య నివేదికలు ఏడు రోజుల్లోనే సిద్ధం చేయాలి. పిల్లలను కొనడం, అమ్మడాన్ని కూడా తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. మైనర్‌పై సామూహిక అత్యాచారం చేస్తే.. జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధిస్తారు.

### ఆర్థిక సంబంధ నేరాలు

ఇక ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరాల ద్వారా వచ్చిన డబ్బులతో వారుకొన్న చరాస్తులను, స్థిరాస్తులను పోలీసులు స్వాధీనం చేసుకునే అధికారం ఉంటుంది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తును రెండు నెలల్లోనే పూర్తి చేయాలి. బాధితుల వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాలి. వాళ్లు లేకుంటే మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచాలి. అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియోల ద్వారా పోలీసులు కేసు నమోదు చేయాలి. అయితే పోక్సో కేసుల్లో మాత్రం బాధితురాళ్ల వాంగ్మూలాలు పోలీసులే కాకుండా మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా నమోదు చేయవచ్చు. క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యాన్ని నివారించడానికి న్యాయస్థానాలు గరిష్ఠంగా కేవలం రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేయాల్సి ఉంటుంది.




### సోదాలు చేసేటప్పుడు అది తప్పనిసరి

కేసు నమోదు నుంచి న్యాయ విచారణ పూర్తయ్యే దాకా ప్రతి సమాచారం కూడా ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా బాధితులకు అందించాలి. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్ష్యాలను జాతీయస్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో జాగ్రత్తగా భద్రపరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (%జజుచీూ%) ద్వారా ఇప్పటికే దేశవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానం చేశారు. దీంతో సాక్ష్యాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. డిజి లాకర్‌ను ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (%×జజీూ%)కు అనుసంధానిస్తారు. దీంతో పోలీసులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు.. అసరమైనప్పుడు సాక్ష్యాలను పరిశీలించుకోవచ్చు. ఇలా చేయడం వల్ల ఆధారాలు ఎవరూ కూడా మాయం చేయలేరు. ఇక ఇళ్ల సోదాల ప్రక్రియను పోలీసులు తప్పకుండా వీడియో తీయించాల్సి ఉంటుంది. సోదాల్లో ఎవైనా అనుమానాస్పద వస్తువులు జప్తు చేసినప్పుడు.. దానికి సంబంధించిన రిపోర్టును 48 గంటల్లోనే కోర్టులో సమర్పించాలి. దీంతో వాటిని తారుమారు చేసే ఛాన్స్ తగ్గుతుంది. అంతేకాదు బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆ ఫర్యాదుపై పోలీసులు 3 రోజుల్లోగా ఫిర్యాదుదారుల సంతకాలు తీసుకోవాలి. మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, దివ్యాంగులు, 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు దాటినవారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. తాము ఉండే చోటే పోలీసుల సాయం తీసుకోవచ్చు.

దర్యాప్తు, న్యాయవిచారణ సమన్లు ఇకనుంచి డిజిటల్ రూపంలోనే అంటేవ వాట్సప్ తదితర మార్గాల్లో పంపొచ్చు. ఇలా చేయడం వల్ల అటు బాధ్యులు, ఇటు పోలీసులు సాకులు చెప్పి తప్పించుకనే ఛాన్స్ ఉండదు. అలాగే సాక్షి మరో ఊరికి వెళ్లి కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి వస్తే.. ఆ ఊరికి వెళ్లాల్సిన అవసరం లేదు. ఉన్న ఊర్లోనే గెజిటెడ్ అధికారి సమక్షంలో వీడియో ద్వారా సాక్ష్యం ఇవ్వొచ్చు. బాధితుల అరెస్టు సమాచారాన్ని వాళ్ల స్నేహితులు, కుటుంబీకులు, బంధువులకు పోలీసులు తెలపాలన్న రూల్‌ను పెట్టారు. దీంతో బాధితులకు తక్షణమే సాయం లభించే అవకాశం ఉంటుంది. అరెస్టు వివరాలను పోలీస్ స్టేషన్లతో పాటు జిల్లా ప్రధాన కేంద్రాల్లో బహిరంగంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. బాధితులకు, నిందుతులకు ఎఫ్ఐఆర్ కాపీ ఫ్రీగా అందిస్తారు. పోలీస్ రిపోర్ట్, ఛార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను రెండు వారాల్లోనే పొందే అవకాశం ఉంటుంది.




## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ముగ్గురు కస్టమ్స్ అధికారులపై సీబీఐ కేసు.!

శంషాబాద్,జూన్ 30(ప్రభాత ఉదయం) శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముగ్గురు కస్టమ్స్ అధికారులపై సీబీఐ ఆదివారం కేసు నమోదు చేసింది. ఈ అధికారులపై విదేశీ కరెన్సీని అక్రమంగా రవాణా చేసేందుకు సహకరించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో నిజాంపేటకు చెందిన ఎ.శ్రీనివాసులు, ఓల్డ్ బోయినపల్లికి చెందిన పంకజ్ గౌతమ్, కానాజీగూడకు చెందిన పేరి చక్రపాణిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. గతేడాది మార్చి 16న శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ, భారత కరెన్సీని సీఐఎస్ఎఫ్,సీఐడబ్ల్యూ సిబ్బంది పట్టుకున్నారు. రూ.4లక్షల భారత కరెన్సీని తీసుకెళ్తున్న నగరంలోని బహదూర్‌పురాకు చెందిన ప్రైవేటు వ్యక్తితో పాటు అతడి కుమారి వద్ద రూ.2,93,425కి సమానమైన వివిధ దేశాల కరెన్సీని నోట్లు ఉన్నాయంటూ సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మూడు, ఢిల్లీలో ఓ చోట నిందితులకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు సోదాలు జరిపి కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని అధికార వర్గాలు తెలిపాయి.



## మన్ కి బాత్ కార్యక్రమం తిలకించిన బిజెపి నాయకులు

రాజేంద్రనగర్, జూన్ 30(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ ఆదివారం ఉదయం 11 గంలకు 111 వ మన్ కి బాత్ కార్యక్రమం కె నర్సింహ బిజెపి సీనియర్ నాయకుడు ఇంట్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి బాబురావు, ఉపాధ్యక్షుడు పవన్ రాజ్ ,ఎస్ మోర్చ అధ్యక్షుడు తొండుపల్లి మల్లేష్ ,ప్రధాన కార్యదర్శి ఈ వేణుగోపాల్ ,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోదీ మన్‌కీ బాత్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు

రాజేంద్రనగర్,జూన్30(ప్రభాత ఉదయం)ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఉదయం 11 గంటలకు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేశారు. మూడోసారి ప్రధాని భాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా మోదీ మన్ కీ బాత్ పేరిట ప్రసారమాధ్యమాల ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిజెపి నాయకులు ప్రజలకు వినిపించేలా టీవీలు పెట్టి ప్రధాని మోదీ 'మనకి బాత్' కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని శక్తి కేంద్రాల్లో నరేంద్ర మోడీ ప్రసంగాన్ని మన్ కీ బాత్ ద్వారా వినిపించారు. మైలార్ దేవులపల్లి డివిజన్ కాటేదాన్ బిజెపి కార్యాలయంలో ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తొలి సారి ( మాన్ కీ బాత్) కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ...దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్ళి ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా పనిచేయాలన్నారు. మోడీ నాయకత్వంలో ప్రపంచంలోనే అన్ని రంగాల్లో దేశాన్ని విశ్వ గురువు తీర్చి దిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అదే విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్న రంగాల్లో ఆదర్శవంతమైన రాష్ట్రంగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆడికే జనార్ధన్,రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,మధుసూధన్ రెడ్డి,బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.




## జులై 1 నుంచి 'స్టాప్ డయేరియా' కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 30 (ప్రభాత ఉదయం): జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'స్టాప్ డయేరియా' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏపీ వైద్యారోగ్య శాఖ సిద్ధమైంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏపీ వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తోంది. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ మేరకు జూన్ 14 నుంచి సన్నాహక చర్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా.. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. డయేరియా (నీళ్ళ విరోచనాలు) కారణంగా సంభవిస్తున్న చిన్నారుల మరణాలను నిరోధించడమే లక్ష్యంగా దీన్ని రూపొందించారు. ఇప్పటికే అమలులో ఉన్న డయేరియా నివారణ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ఇవ్వడంతో పాటు రెండు వారాల పాటు జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి కొత్తగా రూపొందించిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను కూడా అందజేస్తారు. అంతేకాకుండా డయేరియా వ్యాధి నిరోధానికి పూర్తి స్థాయిలో తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు గాను 2 నెలల పాటు సుదీర్ఘ ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం అమలులో వైద్యారోగ్యశాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పట్టణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం , గిరిజన సంక్షేమం వంటి పలు ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యమయ్యేలా వైద్యారోగ్య శాఖ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 2014లో ప్రారంభమైన ఈ కార్యక్రమం, డయేరియా సమస్యను నిరోధించడం, దాని నుండి చిన్నారులను రక్షించడం, చికిత్స అందించడం వంటి చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)తో పాటు జింక్ ట్యాబ్లెట్ల వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారించింది. కాగా కొత్తగా చేపట్టిన ఈ కార్యక్రమంలో డయేరియా, వ్యక్తిగత, పరిసరాల పారిశుద్ధ్య నిర్వహణ, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, టాయిలెట్ల నిర్వహణ, చిన్నారులకు ఓఆర్ఎస్ అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ రెండు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మొదటి దశలో స్టాప్ డయేరియా సన్నాహక కార్యక్రమం జూన్ 14 నుండి 30 వరకు వరకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టగా.. రెండో దశ కార్యక్రమాన్ని జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశా వర్కర్లు , ఎఎన్ఎం, సీహెచ్‌వోల ద్వారా పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు వీళు వెళ్లి డయేరియా బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, డయేరియా బారిన పడ్డాక ఏంచేయాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. డయేరియా సోకిన వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేయడం, వాడడం వంటి విషయాల్ని వివరించడమే కాకుండా డయేరియా ఉన్నట్లు సమాచారమందిస్తే 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను కూడా అందించేలా చర్యలు తీసుకుంటారు. స్టాప్ డయేరియా సన్నాహక కార్యక్రమాన్ని జూన్ 24న కేంద్ర వైద్యారోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె.పి.నడ్డా న్యూఢిల్లీలో ప్రారంభించిన విషయం తెలిసిందే.



## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బిజెపి నాయకులు

రాజేంద్ర నగర్,జూన్30(ప్రభాత ఉదయం) కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని ఆదివారం రాజేంద్ర నగర్ బిజెపి నాయకులు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలోబి జేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వాసు, వెంకటరెడ్డి ,శశికాంత్ శర్మ ,గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్‌గా పాలమూరు ముద్దుబిడ్డ

మొదటి పేజీ తరువాయి...



ఎస్‌బీఐ మరెన్నో మైలురాళ్లు అందుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారుల సాధకబాధకాలు తెలిసిన శ్రీనివాసులు శెట్టి.. ఆయా వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా బ్యాంకింగ్ సేవలు మరింతగా విస్తరింపజేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ట్విట్టర్ వేదికగా శ్రీనివాసులుకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. వీళ్లతోపాటు వివిద పార్టీల నేతల నుంచి కూడా శ్రీనివాసులు శెట్టికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు వారైన చల్లా శ్రీనివాసులు శెట్టి.. తెలంగాణలోని ప్రస్తుత జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడులో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం తెలంగాణలోనే సాగింది. 1988లో ఎస్‌బీఐలో పీవోగా చేరారు శ్రీనివాసులు. బ్యాంకింగ్ రంగంలో 35 ఏళ్ల అనుభవం ఉంది. కాగా.. ప్రస్తుతం ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు శెట్టి.. ఛైర్మన్‌గా ఆగస్టులో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మోదీ 3.0లో మన్ కీ బాత్

మొదటి పేజీ తరువాయి...

తొలిసారి ఈ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే గతంలో మరణించిన తన తల్లి హీరా బెన్‌ను గుర్తు చేసుకున్న ప్రధాని ఎమోషనల్ అయ్యారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ఈ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ కొత్త ప్రచారాన్ని చేపట్టారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్లాంట్ ఫర్ మదర్' పేరుతో కొత్త ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. అమ్మ పేరుతో తాను ఒక మొక్కను నాటానని.. మీరు కూడా తల్లి పేరుతో మొక్కను నాటండి అని సూచించారు. గత మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరిలో మాట్లాడిన ప్రధాని మోదీ.. అప్పుడు చెప్పినట్లుగా మళ్లీ మీ ముందుకు వచ్చినట్లు తెలిపారు. తమ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసం చూపించారని.. తాము దేశంలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. దేశంలో రుతుపవనాల రాకతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. ఎన్నికల కారణంగా మన్ కీ బాత్ కార్యక్రమం కొన్ని నెలల పాటు ఆగిపోయిందని తెలిపారు. కానీ మన్ కీ బాత్ లక్ష్యం మాత్రం దేశంలో కొనసాగుతోందని వివరించారు. 2024 లోక్‌సభ ఎన్నికలు ప్రపంచంలోనే చాలా పెద్దవని.. సుమారు 65 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర ఎన్నికల సంఘాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈరోజు (జూన్ 30) చాలా ప్రాధాన్యం ఉన్న రోజు అని.. మన గిరిజన సోదర సోదరీమణులు 'హల్ దివాస్'గా జరుపుకుంటున్నారని ప్రధాని మోదీ తెలిపారు. వీర్ సిధు, కాన్హూలకు సంబంధించిన రోజు అని.. వారు బ్రిటిష్ వారి వివక్ష చట్టాలు, నిబంధనలను వ్యతిరేకిస్తూ సంతాలి ప్రజలకు కోసం తీవ్రమైన పోరాటం చేశారని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేస్తారని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. 'చీర్4భారత్' హ్యాష్ ట్యాగ్‌తో ఆటగాళ్లను ప్రజలు ప్రోత్సహించాలని ప్రధాని సూచించారు.

## తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్

మొదటి పేజీ తరువాయి...

ఆపరేషన్స్ హెడ్‌గా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్‌ను నియమించేందుకు ఆయనతో చర్చలు జరుపుతున్నామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు తగ్గట్టు త్వరలో కొత్త అంతర్జాతీయ స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరపనున్నామని, సర్కార్ భూమిస్తే సులభంగా కట్టవచ్చన్నారు. అంతేకాకుండా.. 'రెండు, మూడు జిల్లా కేంద్రాల్లోనూ స్టేడియాల నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నాం. టెండర్లు పిలిచి మహబూబ్‌నగర్ స్టేడియంలో టర్ఫ్ వికెట్, నిజామాబాద్ స్టేడియంకు చుట్టు ఫెన్సింగ్ వేయనున్నాం. జూలై 8 నుంచి డొమిస్టిక్ సీజన్ ప్రారంభం. ఈనెల 8 నుంచి డొమిస్టిక్ క్రికెట్ షెడ్యూల్ ప్రారంభమవనుంది. అలానే మహిళల లీగ్ క్రికెట్‌ను కూడా ప్రారంభించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం. ఉప్పల్ స్టేడియంలో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మించే ప్రణాళిక. కొత్త కోచ్‌లు, అంపైర్లు, గ్రౌండ్స్‌మెన్, స్కోరర్ల ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టనున్నాం. పెండింగ్ ఆడిట్లకు మోక్షం. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్లను ఆమోదించాం. ఇవి బీసీసీఐకి పంపిస్తే, బీసీసీఐ నుంచి రావాల్సిన పెండింగ్ నిధులు కూడా రిలీజ్ అవుతాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఒక కమిటీని వేశాం. ఇందులో అపెక్స్ కౌన్సిల్ నుంచి ఒకరు, ఏజీ నుంచి ఒకరు, ఒక న్యాయవాది ఉంటారు. విచారించి, బిల్లులు చెల్లింపులు చేస్తారు..' అని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు తెలిపారు.

## ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి...

నిరాశగా మిగిలిపోయిందని, వారి పక్షాన ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బల్మూరి వెంకట్, ఆకునూరి మురళి వంటి నాయకులు గళమెత్తాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో నిరసనకు దిగిన నిరుద్యోగ యువకులను రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు పరామర్శించి, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధిష్టానం తన హామీలను గాలికి విసిరింది. ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని, ప్రభుత్వం గ్రూప్ 1 కింద అర్హతను 1:50 నుండి 1:100కి పెంచాలని డిమాండ్ చేశారు, తద్వారా నోటిఫై చేసిన ఉద్యోగాల కోసం ఎక్కువ మంది ఔత్సాహికులు పోరాడేందుకు వీలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## బండ్లగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో మేయర్, మాజీ మేయర్ వర్గీయుల మధ్య

# భగ్గుమన్న విభేదాలు


హరిత హారం సందర్భంగా బండ్లగూడ సన్ సిటీ లో గొడవ పడుతున్న కార్పొరేటర్లు


రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి తదితరులు


తనను కులం పేరుతో దూషించి దాడిచేసారని పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ చంద్రశేఖర్


రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న బండ్లగూడ మున్సిపల్ కార్పోరేషన్ నాయకులు

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో ఒకరిపై ఒకరు దాడులు పోలీసులకు ఇరు వర్గాలకు చెందిన నాయకుల ఫిర్యాదు

రాజేంద్రనగర్, జూన్30(ప్రభాత ఉదయం): బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ – మాజీ మేయర్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి . ఆదివారం సన్ సిటీ 6వ వార్డులో జరిగిన హరితహారం లో మొక్కలు నాటు తు ఫోటోలు దిగుతున్న సమయంలో ఒకరిపై ఒకరు దుర్భాషలాడుతూ దాడులు చేసుకున్నారు. ఈ తతంగమంతా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ సమక్షంలోనే జరిగింది . గందలగోళంలో ఎవరిపై ఎవరు దాడి చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. చివరకు ఇరు వర్గాల నాయకులు రాజేంద్రనగర్ పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు వివరాల్లోకి వెళితే......

సన్ సిటీ 6వ వార్డులో ఆదివారం హరితహారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర తోపాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ , మాజీ మేయర్ మహేందర్ గౌడ్ , డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి , కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు . ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మొక్కలు నాటి ఫోటో దిగుతున్న సమయంలో హరీష్ గౌడ్ అనే బీఆర్ఎస్ నాయకుడు మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ కు అడ్డుగా నిలబడ్డాడు. ఫొటోలో మేయర్ కనిపించడం లేదు.... కాస్త జరగండి అని హరీష్ గౌడ్ తో చెప్పడంతో గొడవ మొదలైంది. ఈ గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

**అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయామనే దాడికి పాల్పడ్డారు : మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ :**

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ 6వ వార్డు సన్ సిటీలో ఆదివారం హరితహారం కార్యక్రమం ఉందని కమీషనర్ బి శరత్ చంద్ర చెప్పగా అక్కడికి వెళ్లాం . ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తో కలిసి మొక్కలు నాటుతుండగా, ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేని మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు కొందరు తనకు అడ్డుగా నిలబడితే కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వారించారు. అడ్డు జరగాలని చెప్పడంతో అవిశ్వాసంలో ఓడిపోయామని ఆక్కసుతో మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ లపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసాము.

**తనను కులం పేరుతో దూషించారు : కార్పొరేటర్ చంద్రశేఖర్:**

హరితహారం లో పాల్గొన్న తనను కులం పేరుతో దూషిస్తూ గాయపరిచారని కార్పొరేటర్ చంద్రశేఖర్ అన్నారు. మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ కు అడ్డుగా నిలబడ్డారని , అడ్డు జరగాలని కోరగా హరీష్ గౌడ్, శివ గౌడ్ తో పాటు మరికొందరు తనను కులం పేరుతో దూషించారని, దాడి చేసి చొక్కా చింపివేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనకు న్యాయం చేయాలి.


తనను గాయపరిచారని చెబుతున్న శ్రీనాథ్ రెడ్డి

**తనపై కూడా దాడి చేశారు : బీఆర్ఎస్ నాయకుడు హరీష్ గౌడ్:**

హరితహారం లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి పాల్గొన్నాను. ఈ సమయంలో తనపై కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు అకారణంగా దాడి చేశారు . అందుకే రాజేంద్రనగర్ పోలీసులకు తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాను.


హరితహారం కార్యక్రమంలో సన్ సిటీలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ , తదితరులు

## బండ్లగూడ సన్ సిటీలో హరితహారం

రాజేంద్రనగర్, జూన్30(ప్రభాత ఉదయం) : బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీ పీ అండ్ టీ కాలనీలో ఆదివారం హరితహారం కార్యక్రమం జరిగింది. వన మహోత్సవం కార్యక్రమం లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం పెరిగితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. ప్రతిఒక్కరు పచ్చదనం పెంచే దిశగా అడుగులు వేయాలని సూచించారు. బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరితహారం పేరుతో నిర్వహించిన కార్యక్రమం చాలా సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో హరితహారంలో దేశానికి ఆదర్శగా నిలిచామని గుర్తు చేసారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు,కమీషనర్, కాలనీ వాసులు ఉన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## కాటేదాన్‌లో ఉచిత వైద్య శిబిరం

బుద్వేల్, జూన్30(ప్రభాత ఉదయం): కాటేదాన్ శాంతి నగర్ లో గల రవి బ్రిలియంట్ హై స్కూల్ లో ఆదివారం బద్రి విశాల్ ఫన్నాలాల్ పిత్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు, మానవ సేవనే మాధవ సేవ అన్నారు. పేదలకు ఉచిత సేవ అందించే ఉదేశ్యం తో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం చాలా సంతోషగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్కూల్ సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు


మైలార్ దేవుపల్లి ప్రజా పాదుపు సంఘం పక్కన ఉన్న డైరీ లోకి దూసుకు వెళ్లిన లారీ

## రోడ్డు పక్కన ఉన్న డైరీలోకి దూసుకెళ్లిన లారీ

బుద్వేల్, జూన్30(ప్రభాత ఉదయం) : మక్తల్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా కాటేదాన్ వైపు ఆదివారం దానా లోడు తో వెళ్తున్న ఏపీ 07 ఎక్స్ ఓ 0369 నెంబర్ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో మైలార్ దేవుపల్లి ప్రజా పొదుపు సంఘం పక్కనున్న డైరీ ప్రహరీ గోడను ఢీ కొట్టింది. దీంతో ప్రహరీ గోడ పక్కన పార్కు చేసిన టీఎస్ 0 6 8580 నెంబర్ కారు తో పాటు టిఎస్ 09 యుఏ 4223 నెంబర్ ఆటో ల పై పడింది. కారు, ఆటోలో ఆ సమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని తెలుసుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ధ్వంసమైన కారు, ఆటో

## బుద్వేల్ టీచర్స్ కాలనీలో పరిసరాల పరిశుభ్రత


శ్రమ దానం లో పాల్గొన్న బుద్వేల్ టీచర్స్ కాలనీ సభ్యులు


శ్రమదానం లో పారిశుద్ధ్య విభాగం అధికారులు, కాలనీ వాసులు


రోడ్డుకు అడ్డుగా ఉన్న మొక్కలను తొలగిస్తున్న కాలనీ వాసులు


రోడ్డు పక్కన వేసిన మట్టి కుప్పలను ఎత్తుతూ....

**స్వచ్ఛందంగా పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు**

బుద్వేల్, జూన్30(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలో ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ సహకారంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో టీచర్స్ కాలనీ పరిసరాలను శుభ్రం చేశారు . ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అక్కడ నివసిస్తున్న ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్తను ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటో లకు ఇవ్వాలన్నారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయకూడదన్నారు. ప్రతి నెల ఒకసారి కాలనీ వాసులంతా కలిసి శ్రమదానం చేసుకున్నట్లయితే కాలనీలో పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు పెరగవన్నారు. ఈ విషయంలో మున్సిపల్ సిబ్బందికి కాలనీవాసులు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ముఖ్య సలహాదారులు ఎ. వెంకటేశ్వర్లు , హానోక్ జయకుమార్ , కె. ఎస్ దయానంద్( డేవిడ్ ) అధ్యక్షులు దేవులపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షులు నరసింహులు , ప్రధాన కార్యదర్శి కె జగన్మోహన్, సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి టి కృష్ణ , కార్యవర్గ సభ్యులు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రాజేంద్రనగర్ శ్రీ పోచమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవాలు

### రాజేంద్రనగర్ లోని శ్రీ మాతా పోచమ్మ దేవాలయం

### దేవాలయంలో కొలువుదీరిన శ్రీ మాత పోచమ్మ అమ్మ వారు

బుద్వేల్, జూన్30(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని శ్రీ మాతా పోచమ్మ అమ్మవారి దేవాలయ 17వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ దేవాలయాన్ని 17 సంవత్సరాల క్రితం తిరిగి భక్తుల సహకారంతో పునర్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు అభిషేకాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమై, ఉదయం 10 గంటలకు కుంకుమార్చన, సహస్రనామ పారాయణం నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, రాజేంద్రనగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా అన్నదానాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.





# భారత క్రికెటర్లకు బంపర్ బొనాంజ

## రూ.125 కోట్లు ప్రైజ్‌మనీ ప్రకటించిన బీసీసీఐ

**11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలిచిన టీమిండియాకు బీసీసీఐ గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలోని 150 కోట్ల మందిని సంతోషంలో ముంచెత్తిన భారత జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని ప్రకటిం చింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జైషా ప్రైజ్‌మనీని ప్రకటిం చారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఈ విజయంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.**




టీ20 ప్రపంచకప్ 2024లో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియాకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ బహుమతిని ప్రకటించింది. 11 ఏళ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెరదించిన భారత జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని ప్రకటించింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జైషా సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికా, వెస్టిండీస్ వేదికగా జరిగి ఈ టోర్నమెంట్ అంతటా జట్టు అసాధారణమైన ప్రతిభ, సంకల్పం, క్రీడా నైపుణ్యాన్ని భారత్ ప్రదర్శించిందని ఈ సందర్భంగా జైషా కొనియాడారు. ఈ అత్యుత్తమ విజయానికి కారణమైన ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. కాగా టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో భారత్ ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ఫలితంగా 11 ఏళ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం భారత్ కొనసాగిస్తున్న నిరీక్షణకు తెరదించింది. 150 కోట్ల మంది ప్రజల్లో సంతోషాన్ని నింపింది. ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్న బీసీసీఐ.. ఈ మేరకు ఆటగాళ్ల కోసం భారీ ప్రైజ్‌మనీని ప్రకటించింది.



## కల నెరవేరింది..

# ఇక వీడ్కోలు

### కోహ్లీ, రోహిత్ బాటలోనే రవీంద్ర జడేజా

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బాటలోనే భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నడిచాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్ సాధించిన కొన్ని గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నాడు. కాగా ప్రపంచకప్ టైటిల్ గెలిచిన వెంటనే మాట్లాడిన విరాట్ కోహ్లీ.. టీ20లకు గుడ్‌బై చెప్పేశాడు. ఇక ట్రోఫీని ముద్దాడిన అనంతరం రోహిత్ శర్మ సైతం.. తాను ఇక భారత్ తరఫున టీ20లు ఆడబోనని చెప్పేశాడు. తాజాగా రవీంద్ర జడేజా సైతం టీ20 కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు. ఈ మేరకు తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు.

"నేను మనస్ఫూర్తిగా అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నా. నా దేశం కోసం నా అత్యుత్తమ ప్రదర్శననే చేశా. ఇతర ఫార్మాట్‌లలో (వన్డేలు, టెస్టులు) కెరీర్‌ను కొనసాగిస్తా.. అదే ప్రదర్శన చేస్తా. టీ20 ప్రపంచకప్ గెలవాలనే కల టీ20 ప్రపంచకప్ 2024తో నిజమైంది. ఇది నా అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో గొప్ప ఘట్టం. నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికీ ధన్యవాదాలు." అని తన ఇన్ స్టాలో రవీంద్ర జడేజా రాసుకొచ్చాడు.

భారత్ తరఫున 2009న టీ20 క్రికెట్‌లో అడుగుపెట్టిన రవీంద్ర జడేజా.. ఇప్పటివరకు 74 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అందులో 515 పరుగులు చేశాడు. 54 వికెట్లు పడగొట్టాడు. కాగా టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో రవీంద్ర జడేజా కూడా సభ్యుడిగా ఉన్నాడు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే భారత స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించగా.. కొన్ని గంటల తర్వాత జడేజా తన నిర్ణయాన్ని వెల్లడించాడు.

అయితే టెస్టులు, వన్డేలతో పోలిస్తే టీ20ల్లో రవీంద్ర జడేజా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. టీ20 ప్రపంచకప్ 2024లోనూ ఆశించిన మేర రాణించలేదు. రెండేళ్ల తర్వాత జరగనున్న టీ20 ప్రపంచకప్ కోసం యువ ఆటగాళ్లను తయారు చేయాలని టీమిండియా యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో జడ్డూ టీ20ల నుంచి తప్పుకున్నాడు. కానీ వన్డేలు, టెస్టుల్లో మాత్రం భారత్ తరఫున మెరుగైన ప్రదర్శనను కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జడేజా వెల్లడించాడు. ఐపీఎల్‌లోనూ అతడూ ఆడనున్నాడు. ఇక టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత భారత్ ముగ్గురు ప్లేయర్ల సేవలను టీ20ల్లో కోల్పోయింది.



## రోహిత్-కోహ్లి.. దాని కోసం

# ఇంకా కొనసాగండి!: గంభీర్

టీ20 వరల్డ్ కప్-2024 ఛాంపియన్‌గా భారత్ అవతరించింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి 13 ఏళ్ల ప్రపంచకప్ నిరీక్షణకు టీమిండియా తెరదించింది. గెలుపు ఆశలు లేని స్థితి నుంచి అద్భుతంగా పోరాడి జగజ్జేతగా నిలిచింది. నరాలు తెగే ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (76బీ 59 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), అక్షర్ పటేల్ (47బీ 31 బంతుల్లో, 1 ఫోర్, 4 సిక్సర్లు) సత్తాచాటారు. మహరాజ్ (2/23), నోకియా (2/26) చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా ఎనిమిది వికెట్లకు 169 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (52బీ 27 బంతుల్లో, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) పోరాడాడు. హార్దిక్ (3/20) మూడు వికెట్లు, బుమ్రా (2/18), అర్షదీప్ సింగ్ (2/20) చెరో రెండు వికెట్లతో విజృంభించారు. అయితే ఫైనల్ అనంతరం స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. భవిష్యత్ తరానికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దశాబ్ద కాలం పాటు భారత విజయాల్లో ఈ ఇద్దరూ కీలక పాత్రను పోషించారు.అన్నిఫార్మాట్లలో భారత బ్యాటింగ్‌కు మూలస్తంభాలుగా సేవలు అందించారు. అలాంటి ఈ ఇద్దరు ఒకేసారి పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై పలకడంతో ప్రపంచకప్ గెలిచిన ఆనందంతో పాటు తమ ఫేవరేట్ ప్లేయర్లను టీ20ల్లో చూడలేమనే బాధ అభిమానుల్లో వెంటాడుతోంది. కాగా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి రిటైర్మెంట్ గురించి భారత మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ప్రపంచకప్ గెలిచిన అనంతరం వీడ్కోలు పలకడం కంటే మరో గొప్ప ముగింపు ఉండదని అన్నాడు. అయితే వన్డే, టెస్టు ఫార్మాట్‌లో వారిద్దరు మరికొన్నాళ్లు కొనసాగాలని అన్నాడు. వన్డే, సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టు విజయాల్లో తమ పాత్ర పోషించడం కొనసాగించాలని పేర్కొన్నాడు. "వరల్డ్ కప్ గెలిచిన తర్వాత రోహిత్, కోహ్లి రిటైర్మెంట్ అయ్యారు. ఇంతకంటే గొప్ప ముగింపు కథ మరొకటి ఉండదు. అయితే టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో వాళ్లు కొనసాగనున్నారు. ఈ ఫార్మాట్లలో దేశం కోసం, జట్టు కోసం కీలక పాత్రను కొనసాగిస్తారని ఆశిస్తున్నాను" అని గంభీర్ అన్నాడు.



# రికార్డులు సృష్టిస్తున్న 'కల్కి'

## రూ.500 కోట్ల క్లబ్‌లో చేరిక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. పురాణాలను, సైన్సును ముడిపెడితూ తీసిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లు వసూలు చేసింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేసింది. విడుదలైన తొలిరోజే 191.5 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించిన ఈ మూవీ వారంతానికి రూ.500 కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. దీంతో కల్కి చిత్రం వసూళ్లపై ప్రభాస్ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిస్తున్నారు. అగ్ర తారలు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె తదితర భారీ తారాగణం నటించిన ఈ చిత్రంపై అన్ని చిత్రసీమలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. చిరంజీవి, రజనీకాంత్, మోహన్ బాబు, అల్లు అర్జున్ తదితరులు 'కల్కి' ఓ అద్భుతమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభాస్, అమితాబ్ బచ్చన్ మధ్య ఉన్న యాక్షన్ సన్నివేశాలు, విజువల్ వండర్ దృశ్యాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు ఈ చిత్రంతో పురాణాలను భాగం చేయడంతో కర్ణుడికి సంబంధించి చరిత్ర విశేషాల వీడియోలు, రీల్స్ సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇక 'కల్కి' చూసినవాళ్లు.. పార్ట్-2పై ఎప్పుడు వస్తుందా అని చర్చించుకుంటున్నారు.

# 'రోబో', '2.ఓ'ల్లో కమల్ హాసన్ అందుకే నటించలేదు



రజనీకాంత్ హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రాల్లో '2. ఓ' ఒకటి. ఈ సైన్స్- ఫాంటసీ యాక్షన్ మూవీలో విలన్ పాత్ర కోసం ముందుగా కమల్ హాసన్‌ని అనుకున్నారట దర్శకుడు శంకర్. కానీ, అందులో నటించేందుకు ఆయన తిరస్కరించారు. దానికి గల కారణాన్ని ఇటీవల పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ రోల్ కోసం శంకర్ తనను సంప్రదించగా.. ఇంకా కొన్నాళ్లపాటు హీరోగా ఉండాలనుకుంటున్నానని (నవ్వుతూ) సమాధానమిచ్చినట్లు చెప్పారు. మరోవైపు, తాను కథానాయకుడిగా 'రోబో' ఎందుకు తెరకెక్కలేదో వివరించారు.

### లుక్ టెస్ట్ కూడా పూర్తయింది కానీ..: కమల్ హాసన్

"ఐ-రోబో" అనే ఇంగ్లిష్ నవలను తెరకెక్కిస్తే బాగుంటుందని నేను, శంకర్, రచయిత సుజాత (ఎస్. రంగరాజన్) 90ల్లోనే అనుకున్నాం. హీరో పాత్రకు సంబంధించి లుక్ టెస్ట్ కూడా పూర్తయింది. కానీ, ఆ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. చిత్ర పరిశ్రమలో రెమ్యూనరేషన్, డేట్స్.. ఇలా ఎన్నో లెక్కలుంటాయి. అప్పటి మార్కెట్‌నూ దృష్టిలో పెట్టుకుని ఆ సినిమా చేయకపోవడమే మంచిదనిపించింది. అందుకే నేను వెనకడుగేశా. నా స్నేహితుడు శంకర్ మాత్రం దాన్ని వదల్లేదు. సరైన సమయంలో 'రోబో'ను రూపొందించి, ఘన విజయం అందుకున్నాడు" అని కమల్ పేర్కొన్నారు. కమల్ నో చెప్పడంతో రజనీకాంత్ హీరోగా 'రోబో'ను శంకర్ తెరకెక్కించారు. '2.ఓ'లో ప్రతినాయకుడిగా బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌ని ఎంపిక చేశారు. కమల్-శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'భారతీయుడు 2'. గతంలో వచ్చిన హిట్ మూవీ 'భారతీయుడు'కి సీక్వెల్‌గా రూపొందింది. సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జులై 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అర్జునుడిగా నేను.. ప్రభాస్ కర్ణుడు.. అలాగే చూడండి


'కల్కి 2898 ఏడీ'తో భారతీయ సినిమా మరో స్థాయికి వెళ్లిందని విజయ్ దేవరకొండ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది. అంతేకాదు మూడు రోజుల్లో రూ.415 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. 'కల్కి'లో అర్జునుడి పాత్రలో కనిపించి అలరించారు విజయ్ దేవరకొండ. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన తన పాత్ర గురించి మాట్లాడారు. "కల్కి' సినిమా చూశా. చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఇండియన్ సినిమా మరో స్థాయికి వెళ్లింది. నాగీ, ప్రభాస్ అన్న గురించి చేసిన పాత్ర అది. అర్జునుడిగా మూవీ చివరిలో కనిపించడం, ఆ పాత్ర చేయడం నాకు సంతోషంగా ఉంది. తెరపై విజయ్ దేవరకొండ, ప్రభాస్ అన్నట్లు చూడొద్దు. నన్ను అర్జునుడిగా.. ఆయనను కర్ణుడిగా మాత్రమే చూడాలి. నాగీ యూనివర్స్‌లో మేము పాత్రలు చేస్తున్నాం. నాగీ ప్రతి సినిమాలో నేను చేయడం తను లక్కీఛార్మ్ అని చెప్పొచ్చు. సినిమాలు బాగున్నాయి కాబట్టి నడుస్తున్నాయి. నేను చేయడం వల్లే అతడి సినిమాలు ఆడటం లేదు. 'మహానటి' 'కల్కి' రెండూ గొప్ప సినిమాలు. అందులో మేం నటించామంతే" అని చెప్పుకొచ్చారు. "కల్కి పార్ట్-2'లో మీ పాత్ర ఇంకాస్త



మీరేమంటారు" అని ప్రశ్నించగా, 'ఆయన ఏది చెబితే అది కరెక్ట్' అని విజయ్ దేవరకొండ సమాధానం ఇచ్చారు.

## పొట్టి డ్రెస్‌లో 'యానిమల్' బ్యూటీ కనువిందు

**బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ నటించిన యానిమల్ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద సూపర్ హిట్ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో ఈ సినిమా ఎంత బజ్ క్రియేట్ చేసిందో.. సినిమాలో జోయా పాత్రలో నటించిన త్రిప్తి పై కూడా అంతే బజ్ నడిచింది. జోయా పాత్రలో ఆకట్టుకున్న త్రిప్తి ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. సినిమాలో హీరోయిన్ కంటే కూడా ఈ బ్యూటీ ఎక్కువ క్రేజ్ దక్కించుకుంది. యానిమల్ సినిమాతో ఫుల్ పాపులారిటీ సొంతం చేసుకున్న త్రిప్తి ఇప్పుడు కుర్రాళ్ళ నేషనల్ క్రష్‌గా మారింది. యానిమల్‌తో పాన్ ఇండియా లెవెల్‌లో క్రేజ్ తెచ్చుకున్న ఈ హీరోయిన్ ప్రస్తుతం బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తోంది. అందులో 'బ్యాడ్ న్యూస్' అనే సినిమా కూడా ఒకటి. ఈ మూవీలో త్రిప్తి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విక్కీ కౌశల్, అమ్మీ విర్క్ హాజరయ్యారు. అందరిలోనూ స్పెషల్‌గా ఉండాలని ఆరాటపడే తృప్తి ఈ ఈవెంట్‌లోనూ అందంగా ముస్తాబై సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలబడింది. పొట్టి డ్రెస్ కనిపించి కనువిందు చేసింది. మోకాలిపై వరకే ఉన్న ఈ బ్లాక్ డ్రెస్ ధర వేలల్లో కాదు లక్షల్లోనే ఉంది. వెర్సేస్ అనే బ్రాండ్‌కు చెందిన ఈ మినీడ్రెస్ ఏకంగా రూ.4,06,234 (4 లక్షలకు పైగా) ఉంది. దీని ధర చూసిన నెటిజన్లు..'ఈ పొట్టి డ్రెస్ కి 4 లక్షలా' అంటూ షాక్ కు గురవుతున్నారు.**



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH.** "RNI. Title- Code: TELTEL12231. Cell: 9705231654.